మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**● వనపర్తి జిల్లా ఇంఛార్జ్ ఎస్పీ జె.రంజన్ రతన్ కుమార్**

**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 1, ప్రభాతవార్త:** సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ భవనంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నియమావళి మేరకు పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపర్‌డెంట్‌లకు, అబ్జర్వర్లకు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌లకు, అవగాహన కార్యక్రమం నిర్వహించి పరీక్ష సమయంలో సిబ్బంది మరియు అభ్యర్థులు పాటించవలసిన జాగ్రత్తల గురించి ఎస్పీ జె.రంజన్ రతన్ కుమార్ తెలియజేశారు. వనపర్తి జిల్లా పరిధిలో మొత్తం 3011 మంది ఎస్ఐ అభ్యర్థులు ప్రిలిమినరి రాత పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో మొత్తం9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని, పరీక్షలు ఉదయం 10 గంటలనుండి 1 గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు.అన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండ ఫర్నిచర్ గాలి, వెలుతురు, నీటి వసతి ఏర్పాటు చేయాలని ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల గుర్తింపు కొరకు బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకు వీలుగా అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని,ఉదయం 9 గంటల నుండిఅభ్యర్థులను పరీక్షకేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అన్నారు. ఉదయం 10గంటల తర్వాత అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన నింబంధనలు పూర్తిగా హాల్ టికెట్లో పొందుపరచి ఉంటాయని, అభ్యర్థులు ఒకటి రెండు సార్లు హాల్ టికెట్ లోని నిబంధనలు చదువుకోవడం పర్చిపోవద్దని పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ ఇతర వస్తువులకు అనుమతి ఉండదని చేతులకు గోరింటాకు వంటివి పెట్టుకోవడం వలన బయోమెట్రిక్ లో వేలిముద్రలు సరిగ్గా వచ్చే అవకాశం ఉండదని, తద్వారా అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉంటుందని, ఈవిషయాన్ని గ్రహించి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గోరింటాకు పెట్టుకోవద్దని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని సెల్‌ఫోన్, చేతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంఛార్జ్ ఎస్పీ జె.రంజన్ రతన్ కుమార్

గడియారాలుఆతర ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలగునవి ఎవరు తీసుకురాకూడదని తెలిపారు. పరీక్షకు సంబంధించిన నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయబడుతాయని తెలిపారు. ఎంపిక విధానం పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని అభ్యర్థులుగుర్తించాలని, ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని అటువంటి మోసగాళ్ల సమాచారం పోలీసులకు తెలపాలన్నారు.ఈ రాత పరీక్ష పూర్తిగా రీజినల్‌కో-ఆర్డినేటర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. నోడలనఆఫీసర్ అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్ ఉంటారని ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్న వీరి దృష్టికి తీసుకువచ్చి సందేహాలు నివృత్తి చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, వనపర్తి డీఎస్పీ ఆనంద్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, వెంకట్, వనపర్తి పట్టణ ఎస్ఐ యుగంధర్ రెడ్డి, వనపర్తి రూరల్ ఎస్ఐ చంద్రమోహన్, ఐటీకోర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో పదోన్నతలు మరింత బాధ్యతను పెంచుతాయి: ఎస్పీ

**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 1, ప్రభాతవార్త:** సోమవారం వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ జె.రంజన్ రతన్ కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐటీ కోరు కానిస్టేబుల్ గోవింద్,మదనాపూరం కానిస్టేబుల్ కురుమయ్య గౌడ్, రేవల్లి కానిస్టేబుల్ రోశయ్య, వివిధ పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతులు పొందిన పోలీస్ 3 కానిస్టేబుల్‌లను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతలు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు.పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది మరియు అధికారులు పోలీస్ శాఖలో రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. జిల్లా పోలీస్ శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు అభిస్తాయని ఆయన తెలిపారు . కార్యక్రమంలో ఎస్పీ షాకీర్ హుస్సేన్, వనపర్తి డీఎస్పీ ఆనంద్ రెడ్డి అన్నారు.



పోలీసులను అభినందిస్తున్న దృశ్యం

## ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలి

**● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు1 ప్రభాతవార్త:** ప్రజా వాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. సోమవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో భాగ ంగా రెవెన్యూ సమావేశ మందిరంలో ప్రజల వద్దనుండి ఫిర్యా దులు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు ఇతం ఫిర్యాదులపై జిల్లాఅధికారులు, మండల అధికారులతో సమీక్షించారు. ఎప్పటికప్పుడు ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించినట్లయితే ఫిర్యాదుదారులకు న్యాయం కలుగుతుందని అన్నారు.ముఖ్యంగా ఎక్కడ ఫిర్యాదులు అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలని, దీని వల్ల ఫిర్యాదుదారులు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదని తెలిపారు. భారత స్వాతంత్ర వజ్రోత్సవాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సోమవారం సుమారు 117 మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్ట ర్‌తో పాటు, జిల్లా అధికారులకు సమర్పించారు. కాగా జిల్లా కలెక్టర్ ప్రజా ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్క రించడంలో భాగంగా కొన్ని ఫిర్యాదులను జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరించగా మరికొన్ని మండలస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, ప్రత్యేక కలెక్టర్ పద్మశ్రీ, జడ్పీ సీఈఓ జ్యోతి, జిల్లా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న

## వృద్ధులకు ఆలన ద్వారా వైద్య సేవలు

**◆ నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



ఆలన వాహనాలు జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో క్యాన్సర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు అవసరమైన ప్రత్యేక చికిత్స అందించేందుకు ఆలన వాహనాలు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆలన వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఇంటిపట్టునే ఉంటున్న వయో వృద్ధులకు జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ఆలన వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. వాహనాంలో డాక్టర్‌తో పాటు ఎఎన్ఎం, సిబ్బంది ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పక్షవాతం,వంటి దీర్ఘకాలిక రోగాలతోబాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలిస్తామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు గుర్తించిన 72 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి ఆలన ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ఆలన సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి దీర్ఘకాలిక, పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధులను గుర్తించి ఆలన ద్వారా చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సుధాకర్‌లాల్,ఆలన మెడికల్ అధికారి డా. శ్రీవాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డా.కృష్ణమోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్. శ్రీను, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఓలకు లక్కిడిప్ ద్వారా శాఖల కేటాయింపు

**నాగర్‌కర్నూల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 167 మంది విఆర్ఓలకు అత్యంత పారదర్శకంగా వివిధ శాఖలకు కేటాయింపులు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారుల సమక్షంలో విడియో కవరేజ్ చేయిస్తూ లక్కిడిప్ ద్వారా విఆర్ఎఓలకు శాఖల కేటాయింపులు జరిగాయి. జిల్లాలోని వివిధ శాఖలలో 175 ఖాళీలు గుర్తించి ప్రభుత్వం ద్వారా సిఫారసు చేయగా జిల్లాలోని మొత్తం 167 మంది విఆర్ఓలకు లక్కిడిప్ ద్వారా శాఖల కేటాయింపు చేసినట్లు తెలిపారు. కేటాయింపు జరిగిన విఆర్ఓలకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వెంటనే వారికి కేటాయించిన శాఖల ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ మనుచౌదరి, మోతిలాల్ నాయక్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్కిడిప్ తీస్తున్న కలెక్టర్

## అవసరాలే ఆవిష్కరణలకు పునాది

**◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ హరిచందన**

**నారాయణపేట,ఆగస్టు1 ప్రభాతవార్త:** ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ (గోడపత్రిక) ఆవిష్కరణ సందర్భంగా జిల్లా కలెక్టర్ డి. హరిచందన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ద్వారా తమలోని సృజనాత్మకతను వెలికితీసే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ఈ సంవత్సరం కూడా మొదలైనట్లు తెలిపారు. ఈ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టిఎస్ఐసి)వారు జిల్లాలో అన్ని రంగాలలోని ప్రజల నుండి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. గ్రామాలలో,పట్టణాలలో ఉండే అన్ని రంగాలు, వర్గాల నుండి ఆవిష్కరణలను ఆహ్వానిస్తుంది. గ్రామీణ ఆవిష్కరణలు, విద్యార్థుల ఆవిష్కరణలు, ప్రారంభ ఆవిష్కరణలు,సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలలో ఆవిష్కరణలు మొదలైన ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణ వివరాలైన ఆవిష్కర్త పేరు,వయస్సు,వృత్తి, గ్రామం, జిల్లా, ఆవిష్కర్త వివరణ వ్యాఖ్యలు, ఆవిష్కరణ వివరణ వ్యాఖ్యలు, ఆవిష్కరణ 4 చిత్రాలు, ఆవిష్కరణకు సంబంధించిన 2 నిమిషాల విడియోను 9100678543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన ఆవిష్కరణలను జిల్లాలో జరిగే ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలోవాటిని ప్రదర్శించే అవకాశంఉంటుందని తెలిపారు. ఆవిష్కర్తలకు సర్టిఫికెట్‌ల ప్రధానంతో పాటు టిఎస్ఐసి టీంద్వారా ఉత్తమ ఆవిష్కరణలకు సాంకేతికసహకారం కూడా అందించబడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వెంకటేశ్వర్లు, ఎంఓ విద్యాసాగర్, డిఎస్ఓ హెచ్. భానుప్రకాష్, ఎస్ఓ శ్రీనివాస్, డిపిఓ మురళి పాల్గొన్నారు.



ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ (గోడపత్రిక) ఆవిష్కరణ చేస్తున్న జిల్లా కలెక్టర్

# రైతులకు భరోసా కల్పించేందుకే రైతు రచ్చబండ

**● కాంగ్రెస్ హయాంలోనే రైతులకు న్యాయం: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ**

**లింగాల,ఆగస్టు 1 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలుపరుస్తామని రైతులకు భరోసా కల్పించేందుకే గ్రామాలలో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మానాజిపేట, వల్లభాపూర్, రాంపూర్, బాకారం, మాడాపూర్, సురాపూర్ గ్రామాలలో నిర్వహించిన రైతు రచ్చబండ కార్యక్రమంలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్లు పొందుపరిచిన రైతు సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధి రైతుల పక్షాన నిలిచి వరంగల్లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి రచ్చబండ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. రైతుల సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న టిఆర్ఎస్ ప్రభుత్వంతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు సహాయం కింద 15 వేలు, కౌలు రైతులకు 12 వేలు ఇస్తామన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను కల్పించడంతో పాటు, రైతులకు యమపాశంగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దుచేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కొత్త రెవెన్యూ విధానాలను అమలు చేస్తామన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో కూడిన రైతు డిక్లరేషన్‌లోని అంశాలను ఆయన చదివి వినిపించారు. రైతుల జీవితాలలో వెలుగు నింపే విధంగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గ్రామాలలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ విధివిధానాలు, రైతు డిక్టరేషన్ గురించి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా పని చేయాలని కాంగ్రెస్ శ్రేణులను ఆయన దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లింగమ్మ, సర్పంచ్ స్వామి, వైసిపి నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు డా. శ్రీనివాస్ రాథోడ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కొండల్‌రావు, వర్కింగ్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

## కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

**-తెలంగాణ పిసిసి కార్యదర్శి జి. మధుసూదన్‌రెడ్డి**

**చిన్నచింతకుంట,ఆగస్టు 1 ప్రభాతవార్త:** వ్యవసాయానికి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ పిసిసి కార్యదర్శి జి. మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశంలోనే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను అందిస్తున్నామని, కెసిఆర్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, కాని క్షేత్రస్థాయిలో మాత్రం వ్యవసాయానికి కోతలతో విద్యుత్ సరఫరా అందిస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా మోటార్లు పాడైపోయి వరి, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు ఎల్ఐసిల పేరిట ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తూ రోజుకు 9 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆయన తెలిపారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కోతల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. త్రీఫేస్ ద్వారా రోజుకు 24 గంటలు కాకుండా 18 గంటలైనా కోతలు లేని విద్యుత్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రైతుల ఇబ్బందులను పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే యదేచ్చగా ఇసుక రాజ్యాన్ని నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. రోజు ఎమ్మెల్యే క్షీరాభిషేకం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు తప్ప నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ఆయన ఆరోపించారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపిపిలు కతలప్ప, ధనుంజయ, యూత్ మండల అధ్యక్షులు వెంకటేష్, నాయకులు ఉంద్యాలశేఖర్,గూడూరు శేఖర్,వెంకటేష్, రెహమత్, శ్రీనివాసగౌడ్, ప్రతాప్, రాఘవరెడ్డి,నర్సింలు, దామోదర్, నాగరాజు,



మాట్లాడుతున్న పిసిసి కార్యదర్శి జి. మధుసూదన్‌రెడ్డి

## వీఆర్ఎలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలి

**-బీఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనవాస్‌యాదవ్**

**కల్వకుర్తి, ఆగస్టు 1, ప్రభాతవార్త:** 2017 ఫిబ్రవరి 20న వీఆర్ఎల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో వీఆర్ఎలకు పేస్కేల్, ప్రమోషన్ కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ఏమైందని బీఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనవాస్‌యాదవ్ ప్రశ్నించారు. సోమవారం కల్వకుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు చేపడుతున్న వీఆర్ఎల నిరవధిక సమ్మె సోమవారం 8వ రోజుకు చేరుకున్నది. వీఆర్ఎల నిరవధిక సమ్మె కార్యక్రమానికి బీఎస్పీ కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనవాస్‌యాదవ్ సంఘీభావం మాట్లాడుతూ...2020 సెప్టెంబర్ 12న సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పేస్కేల్ ఇవ్వాలని సీసీఎల్‌ను ఆదేశించిన అసెంబ్లీలో సీఎం ప్రకటించిన రోజే జీవో వచ్చి ఉంటే నేడు ఒక్కో వీఆర్ఎకు రూ.25వేల వేతనం వచ్చి ఉండేదన్నారు. ప్రతి నెల ఒక్కో వీఆర్ఎ రూ.15వేల నష్టపోతున్నారని, గడిచిన 22 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23వేల మంది వీఆర్ఎలు రూ.100కోట్లు నష్టపోయారన్నారు. ఈ నష్టానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదన్నట్లు సీఎం కేసీఆర్ 2 సార్లు అసెంబ్లీలో పేస్కేల్ హామీలు ఇచ్చిన ఆ ఫైల్‌ను తయారు చేసి జీవో విడుదల చేయడంలో సీసీఎల్ఎ అధికారుల నిర్లక్ష్య ఫలితంగానే వీఆర్ఎలు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం పేస్కేల్ జీవోను వెంటనే విడుదల చేయాలని, అర్హత కలిగిన వీఆర్ఎలకు ప్రమోషన్లు కల్పించాలని, 55 సంవత్సరాలు పైబడిన వీఆర్ఎల వారసులకు ఉద్యోగాలు కల్పించి వారికి పెన్షన్ సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరి మల్లేష్, మండల కన్వీనర్ మల్లేష్,నరేందర్, రమేష్, పాండుగౌడ్ తదితరులు ఉన్నారు.



## వంటావార్పుతో వీఆర్ఎల నిరసన

**వంగూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:** వీఆర్ఎలు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఎలు మాట్లాడుతూ న్యాయ పరమైన డిమాండ్లతో వీఆర్ఎలను ఆదుకోవాలని చేపట్టిన నిరవధిక సమ్మెను కొనసాగిస్తూ తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేంత వరకు ఉద్యమిస్తామన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన ఉద్యమంలా కొనసాగిస్తామన్నారు. రైతులకు, ప్రజలకు రెవెన్యూ సిబ్బందితో ఇబ్బందులు రాకుండా సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న వీఆర్ఎల కష్టాలను ప్రభుత్వం గుర్తించకపోవడమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీఆర్ఎలు రమేష్, శ్రీను, గెల్వయ్య,హుస్సేన్, పద్మ, జ్యోతి, పార్వతమ్మ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించాలి

**● వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్‌భాష**



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 1, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ ప్రజావాణి సమావేశ మందిరంలో ఆమె ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివధ ప్రాంతాల నుండి దరఖాస్తుల ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నిశాఖల అధికారులకు ఆమె సూచించారు కార్యక్రమం ద్వారాదరఖాస్తుదారుల నుండి 20 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**● ప్రజావాణిలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పి వెంకటేశ్వర్లు**



**మహబూబ్‌నగర్,ఆగస్టు1,ప్రభాతవార్త:** పోలీస్టేషన్లకు వచ్చి సమస్యలపై ఫిర్యాదులు ఇస్తే వాటిని వెంటనే అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పి ఆరన వెంకటేవ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పి ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని ఫిర్యాదులు తీసుకున్నారు.వాటిని పరిష్కరించేలా సంబందిత అధికారులకు అదేశాలు చేశారు.పోలీస్టేషన్లలో అధికారులు వివక్ష లేకుండా విధులు నిర్వహిస్తే ఎవరు కూడా జిల్లా పోలీసు కార్యాలయం వరకు ఫిర్యాదులు రావని అన్నారు.ఎక్కువశాతం ఫిర్యాదులు వచ్చే పోలీస్టేషన్లపై వాచ్చే ఫిర్యాదులను నోట్ చేసి అక్కడ సక్రమంగా పోలీసు వ్యవస్థ పని చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం జరుగాలని అన్నారు.పోలీస్టేషన్ పరిధికి మించి ఉంటే వాటిని జిల్లా స్థాయిలో పరిష్కరించి ప్రజలకు న్యాయం జరిగేల శాంతి భద్రతలను కాపాడుతామని అన్నారు.

## ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

**వెల్దండ, ఆగస్టు 1, ప్రభాతవార్త:** అర్హులైన ఓటర్ కలిగి ఉన్న వారు ఓటర్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి ఓటర్ అనుసంధానం 2023 మార్చి నెల వరకు ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించి మండలంలో లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ వరలక్ష్మి, ఆర్ఐ శంకర్, పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

## జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దూరం



నిల్వ నీటిని పారబోస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధుల నుండి దూరంగా ఉండ వచ్చని డిఎంఓ విజయ్‌కుమార్ సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 27,26,11,12,3వ వార్డుల్లో సోమవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా స్థానిక సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. మురుగు నీరు,నిల్వనీరు, పరిసరాల పరిశుభ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఇంటి పరిసరాలలో నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటితొట్లు, పాతటైర్లు, కుండల్లో వర్షంనీరు నిల్వ ఉండకుండా బోర్లించి పెట్టుకో వాలని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి డ్రైడే చేయాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్‌కుమార్, శశికిరణ్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా. శివకాంత్, హెల్త్, అంగన్‌వాడి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన



నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

**కృష్ణ,ఆగస్టు 1 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని కున్సి గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగదేవత దేవాలయంలో నాగులచవితి సందర్భంగా సోమవారం ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అర్చకుల చేత ప్రత్యేక పూజలు, హోమం, కళశపూజ నిర్వహించి ఘనంగా నాగదేవత విగ్రహం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ స్వామి, ఆలయ కమిటి అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు శరణగౌడ్, నల్లె నర్సప్ప, శరణప్ప, వెంకట్‌రెడ్డి, రాజప్పగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్,ఎంపిటిసి రాంచందర్, సిద్దప్ప, మహదేవ్, నాగేందర్, రుద్రప్ప, మాణిక్యప్ప, చంద్రశేఖర్, సాయిబన్న, పూజారి శరణప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెరాస కార్యకర్తకు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే



తెరాస కార్యకర్త అలీమొద్దీన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**కొత్తకోట, ఆగష్టు 1 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో తెరాస ప్రధాన కార్యకర్త ఎండీ అలీ మొద్దీన్ తరచు కడుపు నొప్పితో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జూలై 22న ఇంటికి వెళ్లి పరామర్శించారు. తదుపరి చికిత్స కోసం వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని ఎమ్మెల్యే మనోధైర్యం ఇచ్చి సూచించగా మహబూబ్‌నగర్ లోని శ్రీహర్ష ఆసుపత్రికి కుటుంబ సభ్యు లను తీసుకొని వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం అపెండిక్స్ ఆపరేషన్ చేసుకున్న అలీమొద్దీన్ కు ఎమ్మెల్యే ఆలన్న ఆదేశాల మేరకు పీఏ రాజు గౌడ్ సోమవారం మధ్యాహ్నం శ్రీహర్ష ఆసుపత్రికి వెళ్లి తెరాస కార్యకర్త అలీంను పరామర్శించి ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి పంపిన రూ.15వేలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ ఖాజమైనుద్దీన్, మాజీ వార్డు సభ్యుడు ఎండి రజియొద్దిన్‌లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డికి బాధిత కుటుంబం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 4న వాల్మీకుల ధర్నా

**అమరచింత,ఆగష్టు 1 ప్రభాతవార్త:** వాల్మీకులను ఎస్టీ జాబి తాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వాల్మీకి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 4వ తేదీన అమరచింత తహాసి ల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాకు మండలంలో ఉన్న వాల్మీకులు భారీగా మాజరు కావా లని వాల్మీకి సంఘం నాయకులు ఎం.ఆంజనేయులు, క్రిష్టపల్లి రాజు,కడియాలయాదగిరి,సింగంపేట రఘు,రమేష్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు.వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చుండంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుక పడి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.

## ఎస్టీ కమిటీ హాల్ వద్ద బోరు మోటార్ బిగింపు



**కల్వకుర్తి, ఆగష్టు 1, ప్రభాత వార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని 3వ వార్డులో నిర్మాణవుతున్న తాలూకా స్థాయి ఎస్టీ కమిటీ హాల్ వద్ద బోరు మోటార్ కొరత ఏర్పడ టంతో గిరిజన కమిటీ సభ్యులు నాగర్ కర్నూల్ జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందిం చిన ఆయన తన సొంత డబ్బులతో బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సింగిల్ ఫేస్ బోరు మోటార్, పైపింగ్ సామాగ్రిని గిరిజన కమిటీ సభ్యులకు అందించారు. సోమవారం ఎస్టీ కమిటీ హాల్ వద్ద బోరు మోటార్‌ను బిగించారు. ఎస్టీ కమిటీ హాల్‌కు బోరు మోటర్ సమకూర్చిన జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలునాయక్, గిరిజన కమిటీ సభ్యులు నిశాంత్‌నాయక్, ప్రశాంత్‌నాయక్, రామునాయక్, హర్యనాయక్, భీమ్లానాయక్, వంశీనాయక్ తదితరులు ఉన్నారు.

## మార్చాల గ్రామ పంచాయతీకి సర్పంచ్ ఉప ఎన్నిక వెంటనే నిర్వహించాలి



**కల్వకుర్తి, ఆగస్టు1, ప్రభాతవార్త:** మార్చాల గ్రామ పంచాయతీకి వెంటనే సర్పంచ్ ఉప ఎన్నికలు నిర్వహించాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ తరుపున గ్రీవెన్స్‌డేలో తహాసీల్దార్ రాంరెడ్డికి వినతి పత్రం అందించారు. మార్చాల గ్రామ సర్పంచ్ ఇటీవల కాలంలో గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందడంతో అప్పటి నుంచి సర్పంచ్ పదవి ఖాళీగా ఉందని, గ్రామ ఉప సర్పంచ్ ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతలు అప్పగించారని, ప్రభుత్వం వెంటనే సర్పంచ్ పదవికి ఉప ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షులు మ్యాకల రాజేందర్, ప్రధాన కార్యదర్శి గోపాల్ ఉన్నారు.

## కార్మికులకు వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

**కల్వకుర్తి, ఆగష్టు 1, ప్రభాతవార్త:** భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భోజరాజు శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని కళ్యాణ్‌నగర్‌లోని సంఘం భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోజరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు 55 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వం రూ.5వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పెళ్లి కానుకలు, ప్రసూతి కానుకలు పెంచాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 3వ తేదీన హైదరాబాద్‌లోని కార్మిక శాఖ భవన ముట్టడి కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, కార్మిక సంఘం జిల్లా నాయకులు యాదయ్య, దర్శన్‌రెడ్డి, బొట్టు రాజు, ప్రభాకర్, నరేష్, కొప్పు రాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.



# ఇచ్చిన హామీలు వెంటనే అమలు పర్చాలి

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డీ.వంశీకృష్ణ**



ఉప్పునుంతలలో విఆర్ఎల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ఉప్పునుంతల,ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా విఆర్ఎలకు వెంటనే పేస్కేల్ అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డీ.వంశీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న విఆర్ఎల దీక్షకు మద్దతుగా ఆయన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎల వ్యవస్థ ఇప్పుడున్నది కాదని గ్రామాభివృద్ధిలో తరతరాల నుండి వారి సేవలు కొనసాగుతున్న నేపథ్యంలో వారిని చిన్నచూపు చూడడం చాలా దారుణమని ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ది ఉన్నా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తిప్పర్తి జగన్ మోహన్‌రెడ్డి, అచ్యుతారెడ్డి, యాదిరెడ్డి, విండో డైరెక్టర్ శ్రీనివాసులు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీను, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మొగిలి మహేష్, యువజన కాంగ్రెస్ ఇంఛార్జి శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులు గున్నమోని శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి గోవింద్‌సింగ్, సదగోడు గ్రామ కమిటి అధ్యక్షుడు సుభాష రెడ్డి, జనార్ధన్, భాస్కర్, ధర్మారెడ్డి, హైస్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ గోకారం శ్రీనివాసులు, మీడియా ఇంఛార్జి శ్రీహరి, పార్టీ కార్యకర్తలు పాల్గొని విఆర్ఎలకు మద్దతు తెలిపారు.

# ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలి

**ఉప్పునుంతల,ఆగస్టు1 ప్రభాతవార్త:** క్రీడల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్రీడా ప్రాంగణాల ఏర్పాటును ప్రభుత్వం స్థలంలో చేయాలని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో యువకులు ఫిర్యాదు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ఇబ్బంది ఏర్పడుతుందని పాఠశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ఉపతహసిల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణంతో పాటు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో శేఖర్‌గౌడ్, భాస్కర్, మహేష్, స్వామి, సాయిబాబు, శ్రీను, అల్లాజి, మల్లేష్, రవి, సురేష్, శివ, మల్లేష్, శ్రీను,శివాజీ యువజన సంఘం అధ్యక్షుడు తోళ్ల మహేష్ తదితరులు ఉన్నారు.



కీడా ప్రాంగణం ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

# బస్టాండ్ అభివృద్ధిని విస్మరించిన పాలకవర్గం

**- అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన బస్టాండ్ ప్రస్తావన ఏమైంది: బహుజన సమాజ్‌పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇంఛార్జి శ్రీనివాస్**



బస్టాండ్‌లో మరుగుదొడ్లు పాడుబడిన దృశ్యం

**మక్తల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** మరికల్ ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణం అత్యంత దుర్భరంగా మారిందని, దీనికి ఎమ్మెల్యేనే బాధ్యత వహించాలని బహుజన సమాజ్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇంఛార్జి బొదిగెలి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం బస్టాండ్‌ను సందర్శించిన అనందరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణీకులకు కనీస వసతులైన నీళ్లు, మరుగుదొడ్లు కరువయ్యాయని, బస్టాండ్ ప్రాంగణం మొత్తం కూడా మురుగునీటితో దుర్గందంతో ఉందని, ఇంత దారుణమైన పరిస్థితిలో ఉన్న బస్టాండ్‌ను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గాన్ని గజ్వేల్‌ని తలదన్నే స్థాయిలో అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రోజుల తరబడి కాన్వాయ్‌లు వేసుకుని తిరిగే ఎమ్మెల్యేకు ఒక్కసారైనా బస్టాండ్‌లలో పరిస్థితులు కనబడకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇదే విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే బస్టాండ్ అభివృద్ధిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదన్నారు. తక్షణమే బస్టాండ్ పరిసరాలను శుభ్రంచేసి, ప్రయాణీకులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలనిడిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి వెంకటేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడువాకిటి ఆంజనేయులు ముదిరాజ్, బీఎస్పీ నాయకులు రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

**శ్రీరంగాపురం,ఆగష్టు1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రం-3లో సోమవారం మండల ఎంపీపీ గాయిత్రి పృధ్వీరాజ్, ఎంపీ టీసీ ఎల్లస్వామి ఆధ్వర్యంలో పిల్లలకు అన్నప్రాస, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ చిన్న పిల్లలకు పలక బలపం పట్టె ముందు చేపట్టే ముఖ్యమైన కార్యక్రమం అక్షరాభ్యాసం అన్నారు. బాలింతలకు, గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేయడం జరిగిందని, పిల్లలు ఎత్తు, బరువులు తీయడంతో పాటు పిల్లలు ఏస్థాయిలో ఉన్నారో బరువు కార్డులో గుర్తించి వారి తల్లిదండ్రులకు పిల్లల ఎదుగుదల స్థాయిని గుర్తించి తెలపడం జరిగిందన్నారు. ఎంపీటీసీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నపిల్లలకు పాఠశాల అలవాటు తో బేసిక్ విద్యకు నిలయం అంగన్వాడీ కేంద్రం అని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు ఆడుకోవడానికి తరగతి గదిలో ఉన్నటువంటి పరికరాలు, భవనం గోడ పైన చిత్రాలు, బొమ్మల మూలంగా చిన్న పిల్లల యొక్క దృష్టి ఆకర్షించడంజరిగిందన్నారు.కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ టీచర్ మంజులరాణి, ఆయమ్మ నాగమ్మ, అంగన్వాడీ సెంటర్-3 విద్యార్థులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీపీ గాయిత్రి

## విషయ సామార్థ్యాలు ప్రగతికి తొలి మెట్టు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా మానిటర్ అధికారి చంద్రశేఖర్

**ఖిల్లాఘనపురం,ఆగష్టు1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోళీపూర్ గ్రామంలో సోమవారం విషయసామార్థ్యాలు ప్రగతికి తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఉషారాణి తెలిపారు . తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాలలో సామార్థ్యాలను పెంపొందిచుటకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా మానిటర్ అధికారి చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు విషయాలపై దిశానిర్దేశం చేశారు. తొలిమెట్టు కార్యక్రమం2 విడుతలుగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. జూలై 30 నుండి ఆగష్టు 2వరకు మొదటి విడుతలో 50% ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేస్తామని అన్నారు. 2వ విడుత ఆగష్టు 3నుండి 6వ తేదీ వరకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు . ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకొని విద్యార్థుల సామార్థ్యాలను పెంపొందించాలని అన్నారు. కరోనా సమయంలో విద్యార్థులు విషయసంగ్రహణలో వెనుక బడిపోయారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, జీహెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి, అజిమ్ పాషా, ఆర్పీలు చిరంజీవి, యుగంధర్, గీతాంజలి, టీఆర్పీలు వెంకటేష్, రాములు, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి

**అమరచింత,ఆగష్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సాక్ష్యాత్ అసెంబ్లీలో వీఆర్‌ఏలకు ఇచ్చిన హామిని అమలు చేయాలని వీఆర్‌ఏ సంఘం మండల అధ్యక్షుడు మహిమూద్ ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు వీఆర్‌ఏల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు వంట వార్పు నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. వీఆర్ ఏ ల సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకారమని ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏ లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . కార్యక్రమంలో వీఆర్‌ఏలు మునిస్వామి, అర్జున్, వెంకటన్న, గాయిత్రి, శ్రీను, రవికుమార్,నారీ,శాంతన్న,విష్ణు,ఆయా గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



వంట వార్పు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

## ఆగస్టు15 నాటికి ఒక జత దుస్తులు సిద్ధం చేయాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

**పాన్‌గల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచింతంగా ఇచ్చే రెండు జతల దుస్తులలో ఆగష్టు 15 నాటికి ఒక జత దుస్తులు సిద్ధం చేయాలని టైలర్లకు ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతనజరిగిన టైలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఇస్తున్న ఏకరూప దుస్తులను కుట్టడానికి ముందుకొచ్చిన టైలర్ల కు పలు సూచనలు చేశారు. మండలంలోని గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తులుకుట్టే అవకాశాన్ని పాన్‌గల్ మండలంలోని టైలర్లకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో విద్యార్థుల దుస్తులను కుట్టాలని ఎంపీపీసూచించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ నాగే శ్వర్‌రెడ్డి, ఎంఈఓకార్యాలయం సిబ్బందిశేఖర్, కురుమూర్తి, పాల్గొన్నారు.

## మాదాసి కురువలుగా గుర్తించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాదాసి కురువ సంఘం నాయకులు

**పాన్‌గల్,ఆగష్టు1 ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల మాదాసి కురువ, మాదారి కురువలుగా గుర్తించాలని కోరుతూ సోమవారం పాన్‌గల్ తహసిల్దార్ యేసయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసి కురువ సంఘం మండల అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ తమను మాదాసి కురువలుగా గుర్తిస్తూ కుల ధృవపత్రాలు జారీ చేయాలని కోరారు. మాదాసి కురువల సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి బాలపీరు, కొల్లాపూర్ తాలుకా ఉపాధ్యక్షుడు మల్లయ్య,కిల్లా వెంకటయ్య, దేవేందర్ నాయకులు సూరయ్య, పర్వతాలు,శ్రీను, సురేష్, బాలపీరు, సహదేవుడు ఉన్నారు.

## ఘనంగా నాగుల చవితి



శివాలయంలో పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**ఉప్పునుంతల,ఆగష్టు1 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల శివాలయంలో సోమవారం నాగుల చవితి పండగ పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శివాలయంలో ఉన్న పుట్ట వద్దకు వెళ్లి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.ప్రతి సంవత్సరం శ్రావణమాసం మొదటి వారంలో నాగులచవితి పర్వదినం రావడం ఆనవాయితీ అని వేకువజామున స్నానమాచరించి పుట్టవద్ద పాలుపోసి పూజలు నిర్వహించారు.

## 7 వరకు తల్లిపాల వారోత్సవాలు



**ఉప్పునుంతల,ఆగష్టు 1 ప్రభాతవార్త:** స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఉప్పునుంతల ఆధ్వర్యంలో ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమృత తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె హాజరై మండల స్థాయి అధికారులకు వివరిస్తూ తల్లిపాల వారోత్సవాలకు సహకరించాలని ఉపతహసిల్దార్ సరస్వతి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారిణి సునితలను కోరారు.

## లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ



పాన్‌గల్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీధర్ రెడ్డి

**పాన్‌గల్,ఆగష్టు1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలు, బాలింతలకు ఎంపీపీ మామిళ్ల పల్లి శ్రీధర్‌రెడ్డి సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గర్భిణీలు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఇస్తున్న గ్రుడ్ల, ఇతర పౌష్టికాహారంను ప్రతి నెలలబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్వాడీలో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ తరగతులకు అంగన్వాడీ పరిధిలోని చిన్నారులు హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు . కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మాధవి, ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు .

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

**అమరచింత,ఆగష్టు 1 ప్రభాతవార్త:** రైతుల భూమిలో అవినీతికి పాల్పడిన తహసిల్దార్ పై చర్యలు తీసుకొని బాధిత రైతులు సోమవారంమండలతహసిల్దార్ కార్యాలయం ముందు బాధితులు ధర్నా నిర్వహించారు. బాధిత రైతులు మాట్లాడుతూ తహసిల్దార్ అవినీతి చేశారని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు తహసిల్దార్ పై అమరచింత పోలీసులు కేసు నమోదు చేసిన ఇప్పటివరకు తహసిల్దార్ పై చర్యలు తీసుకోలేదని బాధితరైతులు ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు తహసిల్దార్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు పోలీస్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

## -జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ

**లింగాల,ఆగస్టు1 ప్రభాతవార్త:** ప్రజల నిర క్షరాస్యత, అమాయకత్వం, అవగాహన రాహిత్యం వల్ల సమాజంలో జరుగుతున్న మానవ అక్రమ రవాణా నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ అన్నారు. శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసంచేసి బెదిరించి బలవంతంగా ఒకచోట నుండి మరొకర చోటికి తరలించి చట్ట వ్యతిరేక పనుల్లో వారిని వినియోగించడం మానవ అక్రమ రవాణాగా పరిగణిస్తారన్న విషయాన్ని గ్రామీణులకు తెలియపరుస్తూ చైతన్యవంతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా



నిర్మూలన కోసం అధికారులు బాధ్యతతో పని చేయాలన్నారు. విద్యతోనే సామాజిక రుగ్మతలు రూపుమాపవచ్చని అన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను వివరించి వాటిని రూపుమాపాలన్నారు. గ్రామం నుండి బ్రతుకుదెరువు కోసం వలసలు వెళ్లిన వారి వివరాలను గ్రామ పంచాయతీలో నమోదయ్యే విధంగా చూడాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల గ్రామీణులు అప్రమత్తంగా ఉంటూ వారి ప్రలోభాలకు గురికాకుండా చూడాలన్నారు. వలసల నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకుని స్థానికంగా ఉపాధి పొందే విధంగా చూడాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పిల్లలు, మహిళలు అక్రమ రవాణాకు గురయ్యే ప్రమాదం ఉందని కావున వారిని అప్రమత్తం చేస్తూ హెల్ప్‌లైన్ నంబర్స్ 1098,100, 181 నంబర్స్‌ను ఉపయోగించుకునే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గీతాంజలి, డిప్యూటి తహసిల్దార్ ముబీనాబేగం, వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి, ఎంపిఓ కరుణనాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఐకెపి సిసి చందునాయక్, రెవెన్యూశాఖ సర్వేయర్ రాంబాబు, విద్యాశాఖ కృష్ణయ్య, ఎస్‌వికె మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, కమ్యూనిటి ఆర్గనైజర్లు మన్సూర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# ముడా డైరెక్టర్‌కు ఘన సన్మానం



ఎంఆర్‌పి భవన్‌లో చంద్రశేఖర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ నాగయ్య,ఎమ్మార్పీలు రాగూర్,ఇక్రమ్,రవిచంచల తదితరులు

**భూత్పూర్, ఆగస్టు1, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)డైరెక్టర్‌గా ఆదివారం పదవీబాధ్యతలు చేపట్టిన సత్తూరు చంద్రశేఖర్‌గౌడ్‌ను సోమవారం భూత్పూర్ మండల వనరుల భవనంలో ఎంఈఓ నాగయ్య,ఎమ్మార్పీలు రాగూర్,ఇక్రమ్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిచంచల, బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యాయులు యాదయ్య,వెంకట్‌నారాయణ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ భూత్పూర్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ముడా డైరెక్టర్లు కృషిచేయాలని కోరారు. భూత్పూర్ మున్సిపాలిటీకి సంబంధించి ఇద్దరు సత్తూరు చంద్రశేఖర్‌గౌడ్(భూత్పూర్), మూససాయులు(అమిస్తాపూర్)ఎన్నిక కావడం సంతోషింపతగ్గ అంశమన్నారు.

# పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు

**ధరూర్,ఆగస్టు1 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని రేవులపల్లి గ్రామంలో స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జాతీయ అనుబంధ సంఘమైన ఎబిఆర్ఎస్ఎం (అచల భారతీయ రాష్ట్రీయ శైక్షనిక్ మహాసంఘ్) పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా లక్ష పాఠశాలల్లో స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన మూడు లక్షల మంది వీర యోధులను స్మరిస్తూ నేటితరం విద్యార్థులకు తమ జీవితాలను పణంగా పెట్టి భరతమాత స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం అమరులైన వీరుల త్యాగాలను గుర్తుచేసే ఉద్దేశంతో విద్యార్థులలో జాతీయ భావాలు పెంపొందించే ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేవులపల్లిలో దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారికి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తపస్ రాష్ట్ర కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎంతో మంది పోరాట యోధులు, సా వ్రతంత్ర్య సమరయోధులుఉద్దంసింగ్,ఖుదిరంబోస్, బతుకేశ్వరదత్, తుర్రె భాజ్‌ఖాన్, మేడం బికజీ బేగం, బేగం హజ్రత్ మహల్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మొదలగు వారిని గుర్తు చేసుకుంటూ వారి సేవలను కొనియాడుతూ నేటి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామంటే అందుకు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి మన దేశానికి స్వాతంత్ర ం సముపార్జించిన దేశ నాయకులకు ఈ ఆజాది క అమృత్ మహోత్సవం సందర్భంగా వారి సేవలను కొనియాడే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం అహర్నిశలు పోరాడిన స్వాతంత్ర సమరయోధులను వారి సేవలను స్మరించుకుంటూ వారు చేసిన త్యాగాలను విద్యార్థులకు ప్రతి సందర్భంలో వివరించి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విష్ణు, తిమ్మారెడ్డి, అరవింద్, గజేంద్ర, రజినికాంత్, సుజాత, పద్మ పాల్గొన్నారు.




ఆజాది కా అమృత్ మహోత్సవ్ నిర్వహిస్తున్న దృశ్యం

# ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలి

**మక్తల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఐసిపిఎస్, డిసిపియు శాఖల్లో ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేశారు. కొట్లాడి సాధించుకున్న నారాయణపేట జిల్లాలోని ఐసిపిఎస్, ఐసిడిఎస్, సిడిపిఓ లాంటి సంస్థల్లో ఉద్యోగాలు ఈ జిల్లా ప్రాంత నిరుద్యోగులకు మాత్రమే ఇవ్వాలి, అలాగే నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులు భర్తీ చేయాలి అలా కాకుండా డబ్బులు తీసుకుని పోస్టులు భర్తీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు, పివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌తో మాట్లాడి ఎఓ నర్సింగరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భాస్కర్,పివైఎల్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌లు మాట్లాడుతూ త్యాగాల తెలంగాణ రాష్ట్రంలో కొట్లాడి సాధించుకున్న నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉద్యోగ నియామకాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఐసిపిఎస్, డిసిపియు, సచలాంటి కేంద్రాల్లోని ఉద్యోగాలు ఇదే జిల్లా నిరుద్యోగులకు ఇవ్వాలని, అలా కాకుండా ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఇతర జిల్లా వాసులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ జిల్లా నిరుద్యోగులకుఅన్యాయం చేసిఇతర జిల్లా వాసులకు ఉద్యోగాలు అమ్ముకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సలీ, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌లు పాల్గొన్నారు.

# వంట వార్పుతో వీఆర్‌ఏల నిరసన



వంటవార్పుతో నిరసన చేపడుతున్న దృశ్యం

**గోపాల్‌పేట,ఆగస్టు 1 ప్రభాతవార్త:** వీఆర్ఏల సమస్యలను పరిష్కరించేందుకు నిరసన సమ్మెలో భాగంగా 7వ రోజు వీఆర్ఏలు తహసిల్దార్ కార్యాలయం ముందు వంట వార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అసెంబ్లీలో హామి ఇచ్చినట్లుగా వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సురేష్, మండల నాయకులు బాలరాజు, కుమార్, శ్రీదేవి, తదితరులు ఉన్నారు

# విద్యుత్ అంతరాయాలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు,ఆగస్టు 1 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలో దాదాపు 2నెలల నుండి అను నిత్యం విద్యుత్ అంతరాయాలకు నిరసనగా సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెరుపు ధర్నాను విద్యుత్ సబ్ స్టేషన్ ముందు నిర్వహించారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనారెడ్డి పాల్గొని మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ సరఫరా చేస్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలకే పరిమితం అయ్యారని, వ్యవసాయ పనులు జోరుగా నడుస్తున్న ఈ సమయంలో రైతులకు కనీసం 5,6 గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ సమస్య 48 గంటల లోపు పరిష్కరించకపోతే వనపర్తి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తునధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్రయూత్ కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ వెంకటేష్ సాగర్, సురేందర్‌గౌడ్,జిల్లా యూత్ నాయకులు రంజిత్ కుమార్, పెబ్బేరు మాజీ వార్డు మెంబర్ వెంకట్ రాములు, సత్యం, జిల్లా బీసీ సెల్‌నాయకులు రాములు యాదవ్, మైనార్టీ నాయకులు షకీల్, ఎస్సీ నాయకులు సర్వేశ్, అసెంబ్లీ యూత్ వైస్ ప్రెసిడెంట్ సూగూరు శివ, కొంకి రమేష్, మండల యూత్ అధ్యక్షుడు రాజ్ కుమార్, టౌన్ యూత్ అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, సాయిగౌడ్, సీనియర్‌నాయకులు సునల్ కుమార్, డైరెక్టర్ రాములు, టౌన్ యూత్ నాయకులు భాను, హేమంత్‌రెడ్డి, జహంగీర్, వినయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# డబ్బా లక్ష్మయ్య స్మారకార్థం ఫిట్‌నెస్ పోటీలు

## ఫిటనెస్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి

**వనపర్తి,ఆగస్టు1 ప్రభాతవార్త:** ఫిట్నెస్ పోటీలలో ముఖ్యఅతిథిగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని కీ.శే డబ్బలక్ష్మయ్య స్మారకార్థం టీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ ఉంగులం తిరుమల్ ఆధ్వర్యంలో జరిగిన వనపర్తి పట్టణ పిట్నెస్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మంత్రి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబ్బ లక్ష్మయ్య అనేక మంది యువకులను శక్తివంతు లుగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కష్టపడి వ్యయ ప్రయాసలతో వ్యాయామం శిక్షణ ఇచ్చి వనపర్తి చరిత్రలో చరిత్రపుటల్లో ఒక పేజీగా మిగిలి పోయారు. ఈ కార్యక్రమంలో ద్వారా తగిన నివాళులు అర్పించాలని నిర్వాహకులని వారి కుటుంబసభ్యులను అభినందించారు వనపర్తి పట్టణ యువకులు ఈ వ్యాయామ పోటీలను వచ్చే సంవత్సరం టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటౌన్ హాలులో జరిపిస్తామని దానిక యువకులు వ్యాయామ శిక్షణ పొంది సిద్ధం కావాలని ఈ పోటీలలో పాల్గొన్న యువకులందరికి ఆశీస్సులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మున్సిపల్ చైర్మెన్ ఏర్పుల గట్టు యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మెన్ పలుసా రమేష్, వైస్ చైర్మెన్‌వాకిటి శ్రీధర్,కౌన్సిలర్ కాగితాల లక్ష్మినారాయణ, పుట్టపాక మహేష్, టీఆర్ఎస్ నాయకులు మిస్టర్ పాలిటెక్నిక్ గంధం విజయ్, మిస్టర్ జూనియర్ కాలేజ్ హెచ్ శ్యామ్లాల్, కోళ్ల వెంకటేష్, ఎల్‌ఐసి కృష్ణ, షేక్ జహంగీర్, అజీజ్ ఖాన్, వల్లభనగర్ విశ్వక్సేన యూత్ సభ్యులు డబ్బా లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పలు గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే



**ఉట్కూర్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండలంలో కురిసిన వర్షాలకు ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం అమాన్‌పూర్, పగిడిమర్రి, సామనూర్, ఓబులాపూర్ గ్రామాలలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.ప్రజలు మట్టిమిద్దెలు, పూరి గుడిసెలలో నివాసం ఉండరాదని సూచించారు. పొలం పనులకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, రాజకీయ నాయకులు, మండల అధ్యక్షులు, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా సిఎం ఇచ్చిన హామీ ఏమైంది?

## ●టిపిసిసి కార్యదర్శి జి.మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న జి.మధుసూదన్ రెడ్డి

**అడ్డాకుల,ఆగస్టు1 ప్రభాతవార్త:** విఆర్ఎలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలుచేసి తారుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ ఏమైందని టిపిసిసి కార్యదర్శి జి.మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. వారం రోజుల నుండి మండల కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న విఆర్ఎలకు సోమవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తానన్నావు, ఉన్న ఉద్యోగులను పీకేస్తున్నావు, ఇందుకేనా తెలంగాణ ప్రజలు మీకు అధికారం కట్టబెట్టిందని అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలను కల్వకుంట్ల కుటుంబం దోపిడీ చేస్తున్నదని, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వారం రోజుల నుండి విఆర్ఎలు ధర్నా చేస్తున్నా దేవరకద్ర ఎమ్మెల్యే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. విఆర్ఎల సమస్యలను టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి నివేదించామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విఆర్ఎల సమస్యలను పరిస్కరించుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శులు విజయమోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు నాగిరెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు షఫీ అహ్మద్,యువత అధ్యక్షులు బాలరాజు,ఉపసర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాయన్న,రాములు,జగదీష్, వెంకట్ రెడ్డి, శ్రీహరి,పరుషరాములు,శరత్‌కుమార్ రెడ్డి, ఖాజామైనొద్దీన్, నిరంజన్ గోరి, హన్మంతు, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి

## ◆మహిళ పోలీస్‌స్టేషన్ సిఐ హనుమప్ప




అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళ పోలీస్‌స్టేషన్ సిఐ హనుమప్ప

**మహబూబ్‌నగర్,ఆగస్టు1,ప్రభాతవార్త:** మానవ అక్రమ రవాణ అమానవీయమని ఈ ఘటనలపై కఠిన చర్యలుంటాయని మహిళ పోలీస్టేషనన సిఐ మనుమప్ప హెచ్చరించారు.సమాజంలోని ప్రతి ఒక్కరు పోలీసులకు సహకారం చేయాలని కోరారు.స్థానిక నవోదయ పార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. పిల్లలు, మహిళలు,వృద్ధులను అక్రమంగా రవాణ చేస్తు మానవ హక్కులకు భంగం కలిగించే సంఘ వ్యతిరేకులను అణిచి వేసేందుకు సమాజం ఏకం కావలసిన అవసరం ఉందని అన్నారు.ఇటువంటి దుర్మార్గాపు చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చిత్త శుద్ధితో కృషి చేయాలని జిల్లా ఎస్‌పి ఆర్ వెంకటేశ్వర్లు అదేశాలు జారీ చేశారని తెలిపారు.ఈ మేరకు సంబందిత శాఖల సమన్వయంతో నిరిత్రమంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాగంగా చైల్డ్‌లైన్ వెల్ఫేర్ కో=అర్డినేటర్ గన్నోజీ చంద్రశేఖర్,వివిద శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరం విజయవంతం



**పెబ్బేరు,ఆగస్టు 1 ప్రభాతవార్త:** పెబ్బేరు పురపాలక పరిధిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంక్షేమ అధికారి శివయ్యఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల హాస్టల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, జలుబు, తదితం సమస్యలు నెలకొన్నట్లయితే ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి సంక్షేమ వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ఆర్‌బిఎస్‌కె డాక్టర్ సునీల్, పిహెచ్ఎన్ సత్యమ్మ, హెల్త్ సూపర్ వైజర్ సూర్యనారాయణ,హెల్త్ అసిస్టెంట్‌లు లక్ష్మిరెడ్డి, తిరుపతయ్య,ఏఎన్ఎం లావణ్య,ఆశాకార్యకర్తలురమాదేవి,సావిత్రి పాల్గొన్నారు.

# దేవరకద్రలో భక్తులకు అన్నదానం

**దేవరకద్ర రూరల్,ఆగస్టు1 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ ఈశ్వరవీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి సోమవారం ఒకరు చొప్పున దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేస్తారు. అందులో జియాల జిస్ట్ యం.లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు భక్తులకు ఈ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాదాపు 350 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ కొండ రాధికభాస్కర్‌రెడ్డి,ఈఓ కొమ్మాలు,క్లర్క్ సూరిబాబు,పూజారులు నాగరాజు,నాగభూషణంలోతో పాటు దేవస్థానం సిబ్బంది దాసు,జయమ్మ,సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# కుల మతాలకతీతంగా దేవాలయాలు, మసీదుల నిర్మాణలకు చేయూత

## చొక్కంపేటలో పీర్ల మసీదును ప్రారంభించిన యువనేత అభిమన్యురెడ్డి



పీర్ల మసీదును ప్రారంభిస్తున్న యువనేత అభిమన్యురెడ్డి

**రాజాపూర్,ఆగస్టు1 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని చొక్కంపేట గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి అందరివాడని, కులమతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తున్నారని మండల ప్రజలు పేర్కొంటున్నారు. కుల మతాలకతీతంగా దేవాలయాలు, మసీదుల నిర్మాణానికి తన వంతు చేయూతనిస్తున్నారు. సోమవారం రాజాపూర్ మండల పరిధిలోని చొక్కంపేట గ్రామంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న పీర్ల మసీదును యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి తన సొంత ఖర్చులతో తన నాయనమ్మ చించోడ్ రేణుకదేవి పేరుమీద పీర్ల మసీదును నిర్మించి ప్రారంభించారు. అంతేకాకుండా మండలంలోని ఉమ్మడి దొండ్లపల్లి పరిధిలోని నూతన గ్రామ పంచాయతీలకు, గ్రామాలకు, తండాల రహదారులను నిర్మించి ప్రజల మన్ననలు పొందారు. అభిమన్యురెడ్డికి గ్రామస్తులు, యువకులు, ముస్లిం సోదరులు పూలమాల వేసి, శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈసందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ అడిగిన వెంటనే కాదనకుండా పీర్ల మసీదు నిర్మించి ప్రారంభించిన ఆయనకు ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో చొక్కంపేట సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఎంపిపి హన్మగళ్ల నర్సింహులు, కుత్నేపల్లి సర్పంచ్ సేవ్యనాయక్, రాఘవపూర్ సర్పంచ్ శ్రీనివాస్, కొర్రతండా సర్పంచ్ హన్యానాయక్, దొండ్లపల్లిసర్పంచ్ లక్ష్మీదేవిరంజిత్‌గౌడ్, అభిమన్యు యువసేన గౌరవాధ్యక్షులు వెంకటయ్యగౌడ్, శేఖర్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ దేవేందర్, ఉపసర్పంచ్ నీలమ్మ, రాజునాయక్, ప్రియాంక చిరంజీవి, వార్డు మెంబర్లు వన్నెరాజు, మంచాల నర్సింహులు, జ్యోతి, బోయరాజు, మంచాల మల్లేష్, యువసేన నాయకులు, ముస్లిం సోదరులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# డ్రమ్స్ సీడర్‌తో వరి విత్తుకోవడంపై అవగాహన

**శ్రీరంగాపురం,ఆగస్టు 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం డ్రం సీడర్ ద్వారా వరి విత్తనాలు నేరుగా విత్తడం జరిగింది . కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి జి.శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ డ్రం సీడర్ ద్వారా ఎకరానికి 10 నుంచి 15 కేజీల విత్తనం సరిపోతుందని అన్నారు. ముందుగా 12 గంటలు విత్తనాలు నానబెట్టి 24 గంటలు మండగట్టి ముక్కులు పగిలిన గింజను డ్రం సీడర్ పరికరంలో పోసి ప్రధాన పొలంలో దమ్ము చేసిన తర్వాత తెగుళ్లను, పురుగులను తట్టుకోగలుగుతుంది. ఈ డ్రం సీడర్ తో విత్తుకోవడం వలన రైతుకు నారు పెంచే పని ఉండదు. అలాగే నాటు వేసే పని ఉండదు కాబట్టి నారు పెంచే ఖర్చును మరియు కూలీల ఖర్చులు దాదాపు ఎకరాకు రూ.8వేలు వరకు పెట్టుబడి తగ్గించుకోవచ్చు. అలాగే డ్రంసీడర్ పద్ధతి ద్వారా విత్తుకునే వారిలో వాడవలసిన కలుపుమందులు, ఎరువులు, నీరు మొదలైనటువంటి యాజమాన్య పద్ధతులను తెలియజేశారు.కార్యక్రమంలో పొలం రైతురామకృష్ణ, కృష్ణయ్య, రాధాకృష్ణ, బాలస్వామి, తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రీనివాస్

# వేపూరు మండల కేంద్రంగా గుర్తించాలని ధర్నా

**మహబూబ్‌నగర్,ఆగస్టు1,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నియోజక వర్గ పరిధి లోని హన్వాడ మండలంలోని వేపూర్ గ్రామ పంచాయితీని మండల కేంద్రంగా గుర్తించాలని మండల కాంగ్రెస్ నాయ కులు యాదిరెడ్డ అధ్వర్యంలో సోమ వారం గ్రామంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. వేపూర్ గ్రామ పంచాయితీ కన్న చిన్న గ్రామాలను మండల కేంద్రాలుగా గుర్తింపు చేస్తున్న అన్ని వసతులున్న వేపూరును అధికారులు ఎందుకు మండల కేంద్రంగా గుర్తిస్తాలేరని ప్రశ్నించారు.వేపూర్‌నుగ్రామ పంచాయితిని మండల కేంద్రంగా గుర్తించే వరకు కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో అంధోళన కర్యాక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాతో ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడిక్కక్కడ నిలిచి పోవడంతో పోలీసులు వచ్చినిరసన కారులను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను నివారించారు. అనంతరం వారిని పోలీస్టేషన్‌కు తరలించాలరు.ఉదయం సమయంలో వర్షం కురుస్తున్న నిరసన కారులు బురదలో నిలబడి అందోళన చేయడం కొసమెరుపు.



వేపూర్‌లో నిరసన కారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

## నేడు నాగుల పంచమి

**పాలమూరు,ఆగస్టు1, ప్రభాతవార్త:** హిందూ సాంప్రదాయానికి, ఆచారవ్య వహారాలకు ప్రతీకలుగా నాగుల పంచమి నిలుస్తుంది.ప్రతి ఏటా శ్రావణమా సారంభంలో ఆమావాస్య తరువాత వచ్చే శుక్లపక్ష పంచమిరోజున ఈ పండు గను జరుపుతారు.నాగదేవతను పూజించి, ఆరాధించడంవల్ల ఇంటిల్లిపాది సుఖసాంతులతో ఉంటారని ప్రతీతి.ఈ రోజు భగవానుడు శ్రీకృష్ణుడు తన లీలల్లో ఒకటైన కాళీయమర్దనం చేసిన రోజని చెబుతారు. నాగపంచమి రోజున అమ్మలక్కలు పెందలాడనే లేచి తలంటుస్నానం చేసి పంచామృ తాలతో, పచ్చిపాలతో నాగదేవతలుండే పుట్టలో పాలు పోసి తన భక్తిని చాటుకుంటారు.పంచామృతాలతో అభిషేకించిపవి త్రజలాలను నెత్తినజల్లు కుంటారు.నాగదేవతను పూజించడం వల్ల సంతాన సాఫల్యం, సౌభాగ్యంతో పలు ఇంటిల్లిపాదికి సర్పదోశముండదని హిందూ స్రీల ప్రగాఢ విశ్వాసం. పరమశివుడి ఆభరణంగా ఉండే నాగదేవత అంటే అందరికి ఎంతో భక్తి.ఈ రోజున నాగదేవతలతో పాటు పార్వతీపరమేశ్వరులను పూజిస్తారు. పుట్ట లోంచి బయటకు వచ్చి నాగుపాములు భక్తితో పోసిన పచ్చిపాలను గ్రోలి తిరిగి లోపలికి వెళతాయట.ఆషాఢ,కార్తీక,శ్రావణమాసాలు హిందూవులకు ముఖ్యంగా వనితలకు ఎంతో భక్తిప్రపత్తిని కల్గిస్తాయని చెప్పాలి.

## హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట,ఆగస్టు 1 ప్రభాతవార్త:** జిల్లా హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2021 బుక్, పిడుగుపాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డి. హరిచందన ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశ మందిరంలో జిల్లా హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో జిల్లాలో ఉన్న పర్యాటన ప్రదేశాలు, చేనేత చీరల వివరాలు, వర్షపాతం వివరాలు, జనాభా వివరాలు, వ్యవసాయం పంట వివరాలు, విద్య, వైద్య,పరిశ్రమల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుం దని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పిడుగుపాటుకు గురికాకుండా రైతులు, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకో వాలని వర్షం పడుతున్న సమయంలో ప్రజలు ఎవరు కూడా చెట్ల కింద ఉండరాదని సూచించారు.కార్యక్రమంలోజిల్లా అదనపు కలెక్టర్ పద్మజారాణి, సిపిఓ గోవిందరాజన్, శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం

**కెటిదొడ్డి,ఆగస్టు 1 ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల ప్రభుత్వ పాఠశాలలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా కెటిదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు చెప్పారు. కార్యక్రమం ద్వారా పిల్లలకు రక్తహీనత గల పిల్లలను గుర్తించి వారికి టాబ్లె ట్లు ఫోలిక్ పింక్ మాత్రలను ప్రతి సోమవారం మధ్యాహ్నం భోజనం తర్వాత ఆశా కార్యకర్తల ద్వారా ఇవ్వాలని సూచించారు. ఆల్బెండజోల్ విట మిన్ సి మాత్రలను కూడా ఇవ్వడం జరిగింది. ఇందులో ముగ్గురు విద్యా ర్థులను జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తూ 15 మంది విద్యార్థులకు స్పాట్ ట్రీట్మెంట్ చేయడం జరిగింది. కార్యక్రమంలో డా. పి. రవికుమార్, డా. నిఖిల, ఎఎన్ఎం ఊర్మిళ, ఫార్మసిస్టు పరశురాం, పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మురళీధర్, ఉపాధ్యాయులు సురేందర్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**వెల్దండ, ఆగస్టు 1, ప్రభాతవార్త:** వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.20వేలు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైంది. సోమవారం టీఆర్ఎస్ పార్టీ నాయకులు కేశమల్ల కృష్ణమహేశ్వరికి మంజూరైన రూ.20వేల చెక్కును బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజశేఖర్, హరిలాల్, మల్లేష్, సాయిబాబా, లక్ష్మయ్య, రమేష్, వెంకటేష్, సుధాకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**మహబూబ్‌నగర్,ఆగస్టు,1,ప్రభాతవార్త:** పెరూర్ గ్రామ పంచాయితీలోని ప్రైమరి పాఠశాలలో సమర్పణ్ సంస్థ అద్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను జిల్లా విద్యాధికారి రవీందర: పంపిణి చేశారు.ఈ సందర్భంగా సంస్థ ముఖ్య కార్య నిర్వహకులు వెంకటశర్మ మాట్లాడారు.విద్యార్థులకు చేయూత నివ్వడం కోసం చిన్న కార్యక్రమం నిర్వహిచండం జరుగుతుందన్నారు.ముందు కాలం లో మరిన్ని సేవా కార్యమాలు నిర్వహిస్తామని హామీ నిచ్చారు.ఈ కార్యక్ర మంలో మాజీ డిఇఓ విజయన కుమార్,హైస్కూల్ ఉపాధ్యాయులు,పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఎల దీక్షకు మద్ధతు



**మల్దకల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సీఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని గత ఎనిమిది రోజుల నుండి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విఆర్ఎలకు మేము అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గద్వాల, మల్దకల్ మండలకేంద్రాలలో దీక్ష కేంద్రాలలోసంఘీభావం తెలిపారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ సీనియర్ పార్టీనాయకులు బల్గెర నారాయణరెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు వీరబాబు,మల్దకల్ మండల అధ్యక్షులు నల్లరెడ్డి, గట్టు మండల అధ్యక్షులుగౌస్,సర్పంచ్ గీతనాయుడు,జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జమాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు రఘునాయుడు,మురళి,రాజు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి, టీఆర్ఎస్ తోడుదొంగలు

**అడ్డాకుల,ఆగస్టు 1 ప్రభాతవార్త:** బిజెపి, టీఆర్ఎస్ తోడుదొంగలని టిపిసిసి కార్యదర్శి జిఎంఆర్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఎక్కడుందని ప్రశ్నించారు. రైతులకు 9 గంటల విద్యుత్ ఇస్తుందని, ఇష్టం వచ్చినట్లు విద్యుత్ కోతలు చేస్తున్నారని విమర్శించారు. ధరలు పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల ఉసురు తగుల్తదని శాపం పెట్టారు. అనంతరం విద్యుత్ అధికా రులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శులు విజయమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు నాగిరెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు షఫీ అహ్మద్, యువత అధ్యక్షులు బాలరాజు, ఉపసర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సాయన్న, రాములు, జగదీష్,వెకటరెడ్డి, శ్రీహరి, పరుష రాములు, శరత్‌కుమార్ రెడ్డి, ఖాజామైనొద్దీన్, నిరంజన్ గోరి, హన్మంతు, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా విఆర్ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**- తెలంగాణ పిసిసి కార్యదర్శి జి.మధుసూదన్‌రెడ్డి**

**చిన్నచింతకుంట,ఆగస్టు 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా విఆర్ఎలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ పిసిసి కార్యదర్శి జి. మధు సూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం విఆర్ఎలు చేపడుతున్న సమ్మెలో పాల్గొని మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపడుతున్న విఆర్ఎలకు కాంగ్రెస్ పార్టీ సంఘీ భావం తెలుపుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మొండిగా వ్యవహ రిస్తూ ప్రభుత్వంపై ఉద్యమం చేపట్టిన ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రోజంతా విరామం లేకుండా విధులు నిర్వహిస్తున్న విఆర్ఎలు వారం రోజులు గా సమ్మెను చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. విఆర్ఎలచే వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం వారిని ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ ద్వారా జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు.అర్హత కలిగిన విఆర్ఎలకు పదోన్నతులు కల్పిం చాలని అదేవిధంగా 55 సంవత్సరాలు దాటిన విఆర్ఎల కుటుం బంలోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, వృధా విఆర్ఎలకు



మాట్లాడుతున్న తెలంగాణ పిసిసి కార్యదర్శి జి. మధుసూదన్‌రెడ్డి

పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. విఆర్ఎల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తామని, జిఓ ఇచ్చే వరకు సమ్మె విరమించరాదని ఆయన విఆర్ఎలకు సూచించారు. కార్యక్రమంలోమాజీ వైస్ ఎంపిపిలుకతలప్ప, ధనుంజయ్, యూత్ మండల అధ్యక్షులువెంకటేష్, మైనార్టీ మండలఅధ్యక్షులు ఖాజామై నొద్దిన్, నాయకులు వెంకటేష్, ఉంద్యాల శేఖర్, గూడూరు శేఖర్, ప్రతాప్,దామోదర్, నాగరాజు,శ్రీనివాస్‌గౌడ్, నరసింహులు, రాఘ వరెడ్డి, అంబరీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# వంటా వార్పుతో విఆర్ఎల నిరసన



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాముసాయక్

**కోయిల్‌కొండ,ఆగస్టు1 ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని తహసిల్దార్ కార్యాలయం ముందు విఆర్ఎలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమ వారం 8వ రోజుకు చేరుకున్న సందర్బంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వీరికి సంపూర్ణ మద్దతు ప్రకటించి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నేతలు విద్యా సాగర్‌గౌడ్, వేముల జగన్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రామునాయక్‌లు మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో విఆర్ఎలకు ఇచ్చిన మాట నిలబెట్టుకో వాలన్నారు.విఆర్ఎలు కొత్త డిమాండ్లు కోరుకోవడం లేదని ఇచ్చిన హామీలే అమలు చేయాలని కోరుతున్నారన్నారు. విఆర్ఎలకు వెంట నే పేస్కేల్ అమలు చేసి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఆర్ఎలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పోరాటం నిర్వహిస్తుందన్నారు.విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర పిసిసి అధ్య క్షుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల విఆర్ఎలు వంటావార్పుతో తమ నిరస నను ప్రభుత్వానికి తెలిపారు. విఆర్ఎల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ నేతలు బూర్గుపల్లి సుధాకర్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ నాయకుడు బండి నాగరాజు, జి. మనోజ్‌కుమార్, మండల మైనార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌస్, రామస్వామి, నరేష్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా విఆర్ఎల జెఎసి అధ్యక్షుడు రాంచంద్రయ్య, కో ఛైర్మన్ కె. యాదగిరి, మండల జెఎసి నేతలు బి. సురేష్, భీమన్న, సంధ్య,యాదమ్మ, ఆనంద్, గోపాల్ పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్ధతు..

**● మాజీ మంత్రి వర్యులు,కమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి**

**వనపర్తి టౌన్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ వీఆర్ఏ లకు పేస్కెల్ విధానం, 55 సంవత్సరాలు పైబడిన వారి కుటుంబంలో విద్యార్హతను బట్టి ఉద్యోగం, అర్హత కలిగిన వీఆర్ఏ లకు పదోన్నతులు ఇస్తామని వాగ్దామనం చేసిన కేసీఆర్ ఇప్పుడు వీఆర్ఏ ల జీతభత్యాలు నేడు రూ.10500లతో జీవనం కొనసాగించడం అగమ్య గోచరంగ తయారైందని వీఆర్ఏ ల నాణ్యమైన డిమాండ్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలపడమే కాకుండా వారి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే భవిష్యత్‌లో ప్రతి పార్టీగా ఉద్య మం చేపడతామని తెలిపారు. పీసీస అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వీఆర్ఏ లకు ముం దుండి మద్దతు తెలిపారని ఆయన గుర్తు చేశారు. రాబోయే కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం లో వీఆర్ఏ ల న్యాయపరమైన డిమాండ్‌లను నెరవేరుస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి వర్గం కష్టాలలో ఉన్నారని మొన్న వచ్చిన వరదలలో ఎంతో మంది బాధితులు నిరాశరీలైతే ముఖ్యమంత్రి ఢిల్లీలో బాండ్లు కుదవపెట్టి డబ్బులు తీసు కొచ్చే పనిలో ఉన్నారు కనీసం ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు .కేసీఆర్‌ను గద్దె దింపడానికి అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు . కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ నాయకులు చీర్ల జనార్దన్, నరేందర్ రెడ్డి, భాస్కర్, వీఆర్ఏ ల సంఘం నాయకులు సురేష్, నరేష్, మహేష్ బాబు, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, లక్ష్మి, తదితరులు ఉన్నారు.



# కరెంట్‌పై కాంగ్రెస్‌ది ధృతరాష్ట్ర ప్రేమ

**● మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్**

**వనపర్తి టౌన్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** కరెంట్ లేక రైతాంగం చేతికి వచ్చిన పంటలు ఎండిపోయిన విషయం రైతాంగం మర్చిపోలేదు, ప్రాజెక్టులకింత పంటలకు కూడావిరామంఇచ్చిన విషయం గుర్తుం దా? లేదా? అని మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్ కాంగ్రెస్ నాయ కులను విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు గుర్తు చేయాలంటే టం మిషన్ తయారు చేసి వెనక్కి తీసుకెళ్లి రావాలేమో అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పరిమశ్రమలకు పవర్ హాలిడేలు ప్రక టించిన విషయం మర్చిపోలేదన్నారు. పరిశ్రమలు, గృహావ సరా లకు 24 గంటల కరెంట్ తో పాటువ్యవసాయ రంగానికి 24 గంటల కరెంట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిగ్గులేకుండా తాత్కాలిక అంతరాయాలపై రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కరెంట్ లేక కారంపొడి తయారు కేంద్రాలు,పిండిగిర్నిలు, వెల్డింగ్‌షాపులు, వండ్రంగి షాపు లు తదితర కుటీర పరిశ్రమలు మూసుకొని తెల్లార్లు కరెంట్ వచ్చినప్పుడు నిద్రకాసిపొట్టకూటి కోసం పనులు చేసుకున్న దుస్థితిని ప్రజలు ఇంకి మర్చిపోలేదన్నారు. ఉత్తరాదిన భారీ వర్షాల తో పవర్ గ్రిడ్‌లలో ఇబ్బందులు,భారీ వర్షాలతో బొగ్గు తవ్వకానికి ఆటంకాలు, ఎక్కడిక్కడ స్థానికంగా భారీ వర్షాలతోపలు అంతరాయాల మూలం గా తాత్కాలిక కరెంట్ అంతరాయాలుతప్ప ఎక్కడా రైతాంగా నికి ఇబ్బందులు లేవన్నారు. 2018 జనవరి 1 నుండి వ్యవసాయ రంగానికి 24గంటల కరెంట్ ప్రభుత్వంఅందిస్తుందనా అన్నారు. ాలుగేళ్లుగా లేని ఇబ్బందులు ఇప్పుడు వస్తున్నాయా?అని ప్రశ్నించా రు.24 గంటలఉచిత కరెంట్ ప్రకటిస్తే వద్ద ని ఆందోళనలు, ఆరోపణలు చేసిన కాంగ్రెస్ సన్నాసులు ఈ రోజు కరరెంట్ సరఫరా గురించి మాట్లాడడంవిడ్డూరంగా ఉందన్నారు.అడగకముందే, హామీ ఇవ్వకుండానే రైతుబంధు,రైతుభీమా,సాగునీళ్లు, 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నది సిఎం కేసీఆర్ రైతుల సమస్యల గురించి మాట్లాడే అర్హత, కరెంట్ గురించి నోరెత్తి అర్మత కాంగ్రెస్ కు లేదు, కాంగ్రెస్ నాయకులు డ్రామాలు మానుకుంటే మంచిదని అన్నారు.

# మోడీ విధానాలతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**-సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరసింహ**

**నాగర్‌కర్నూల్ రూరల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సిపిఐ సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరసింహ హాజరయ్యారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ అనుసరిస్తున్న విధానా లతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. బిజెపి పాలిస్తున్న రాష్ట్రాల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బిజెపి పాలకులు అరాచకాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఒకవైపు నిత్యా వసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతుంటే పెరిగిన ధరలను అదుపు చేయకుండా దేశ సంపదనంతా కార్పోరేట్ వర్గాలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పెంచి పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్,నిత్యావసర వస్తువుల ధరలుతగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశం లో సిపిఐ జిల్లా నాయకులు ఆనంద్‌జీ, వార్ల వెంక టయ్య, ఫయాజ్, కేశవులుగౌడ్, టి. నరసింహ, కొమ్ము భరత్, కోళ్ల ఏసయ్య, నరసింహ, విజేయుడు, ఈర్ల చంద్రమౌళి, కృష్ణాజీ, మర్యాద వెంకటయ్య, గుండె మల్లేష్, కిరణ్‌కుమార్, శివశంకర్, నిరంజన్‌గౌడ్, బొల్లెద్దుల శ్రీనివాసులు, ఇంద్రమ్మ, రవిందర్, పులిజాల పరశురాములు, శివకృష్ణ, తుమ్మల శివుడు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నరసింహ

## ప్రజావాణిలో అఖిలపక్ష ఐక్య వేదిక ఫిర్యాదు

**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 1 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు పేదవారికి పనిజేస్తాయి తప్పడబ్బులు ఉన్నవారికికాదు అని నిరూపిస్తున్నారు మున్సి పాలి టీ అధికారులు అని అచలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాలు, బహుల అంతస్తులు తెలంగాణ రాష్ట్రం తెచ్చిన జీవో ప్రకారం నిర్మించాలి కాని వనపర్తి పట్టణానికి సంబంధించి ఇష్టాను సారంగా పెల్లోర్లతో నిర్మిస్తూ, పార్కింగ్ సౌకర్యం లేకుండా రోడ్డు పైకి నిర్మిస్తున్నారనివారు ఆరోపించారు.దీంతో మున్సిపల్ అధికారులు వాటిని ఫోటోలు తీసుకొని వారిని పిలిపించి వారితో డబ్బులు గుంజుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయని అన్నారు . వారు లంటాలు కట్టి ఇష్టానుసారంగా నిర్మించుకుంటున్నారని, దీని వెనుక కొందరు ప్రజాప్రతినిధులు లోపాయికారి ఒప్పందం ఉందని పలువురు పేర్కొన్నారని, అలాగే వనపర్తి పట్టణానికి చుట్టుప్రక్కల ఉన్న వెంచర్లు చాలా వరకు అక్రమంగా వేస్తున్నారని పలుచోట్ల 10 ఎకరాలకు గాను 2ఎకరాలకు పర్మిషన్ తీసుకొని ఇల్లీగల్ గా 10 ఎకరాల ప్లాట్లు అమ్ముతున్నారని, కొన్ని చోట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టుకున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు . ఇదే మని అడుగుతే వన పర్తిలో మానిట రింగ్ కమిటీ, విజిలెన్స్ కమిటీ కలెక్టర్ వేయా లని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అన్నారు. ఇవన్నీ సాధారణమే అంటూ కమిషనర్ చాలా తేలికగా తీసుకుంటున్న అంశాన్ని పరిశీలిస్తే మీరు ఎంతకు దిగజారారో తెలుస్తుందని విమర్శించారు. తక్షణమే వాటిపై చర్యలు తీసుకోని దానికి బాద్యులైన వారిని సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కు తెలియజేశారు. దీనిపై పలు రకాలుగా మేము వినతిపత్రాలు ఇచ్చా మని త్వరలో చర్యలు తీసుకోకపోతే నిరసన కార్యక్రమాలు తెలుపు తామని, ఆస్థలాలు ఎక్కడని మమ్మల్ని అడిగిన అధికారులకు వారం రోజుల్లోగా వాటిని గుర్తించి మీకు చూపిస్తామని వివరంగా కలెక్టర్ కు తెలిపారు . కార్యక్రమంలో అకోకన్వీనర్ చిరంజీవి, ఉపాధ్యక్షుడు వెంకటేష్, జయరాములు, సతీష్, రమేష్ పాల్గొన్నారు .



కలెక్టర్ కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## కరివెన రిజర్వాయర్‌లో పడి ఇరువురి మృతి

**-చేపల వేటకు వెళ్లి మృత్యుపాలైన ఆలూరు గ్రామస్తులు**



కరివెన రిజర్వాయర్‌లో పడి మృతి చెందిన పెంటయ్య, దేవుజానాయక్

**భూత్పూర్, ఆగస్టు1,ప్రభాతవార్త:** చేపల వేట కు వెళ్లి ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి ఇరువురు మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కరివెన గ్రామంలో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళితే జడ్చర్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన గంజి పెంటయ్య (60), దేవెజానాయక్‌లు ఆదివారం వలలతో కరివెన రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరు రిజర్వాయర్‌లో మునిగి పోయారు. ఆదివారం సాయంత్రం వరకు వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి కుటుంబీకులు వెతకగా సోమవారం ఉదయం ఇరువురు శవా లుగా తేలారు. విషయం తెలుసుకున్న భూత్పూర్ పోలీస్ ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి వివ రాలు సేకరించారు. మృతుడు గంజిపెంటయ్య భార్య గంజి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని భూత్పూర్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**వెల్దండ, ఆగస్టు 1, ప్రభాతవార్త:** వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దువ్వాసి యాదగిరి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోళి శ్రీని వాస్‌రెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో గోరటి శ్రీనివాసులు, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, గుమ్మకొండ రాజు, బాల్‌లక్ష్మయ్య, గిరి, గణేష్, గోపితో పాటు తదితరులు ఉన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ద్వారా కృతిమ కాలు అందజేత

**వెల్దండ, ఆగస్టు 1, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కాటిక సైదులు గత 20 సంవత్సరాల క్రితం కారు ప్రమాదానికి గురై కాలు పూర్తిగా దెబ్బతి నడంతో కాలును శరీర భాగం నుంచి తొలగించారు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రోడ్డు ప్రమాద బాధితుడు సైదులు కృత్రిమ కాలు ఏర్పాటు కోసం రూ.1లక్ష నగదును అందజేయగా... కృతిమ కాలును అమర్చుకొని నడుస్తున్నానని బాధితుడు సంతోషం వ్యక్తం చేశారు. కృత్రిమ కాలు ఏర్పాటుకు సహకరించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడి జన్మదినోత్సవం



**దేవరకద్ర రూరల్,ఆగస్టు 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌లో సోమవారం కాంగ్రెస్‌పార్టీ మండల ఉపా ధ్యక్షుడు చందూగౌడ్ జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు,గ్రామస్థులు,యువకులు చందూ గౌడ్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్‌చేసి ఆయన జన్మదిన వేడుకలను ఓ సంబరంలా జరిపారు.

## ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో పలువురు టీఆర్ఎస్ పార్టీలో చేరిక



**కల్వకుర్తి, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కల్వ కుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయ కులు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మె ల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారా యణరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి టీఆర్ఎస్ పార్టీ కందు వాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తల్లోజు భీష్మాచారి, లక్ష్మయ్య, వెంకటయ్య, మోతీలాల్,సుధాకర్, కరుణాకర్,మహేందర్,చెన్నయ్య, సురేష్,గోపాల్,మల్లేష్‌కుమార్, మహేష్, రాజు, దర్గయ్య, వెంకటేష్, శివ, శంకర్, శ్రీరాములు, మహేష్, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులుగా కలిమిచెర్ల రమేష్



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ సభ్యులు, లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులుగా కలిమిచెర్ల రమేష్

**కల్వకుర్తి, ఆగస్టు 1, ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులుగా కలిమిచెర్ల రమేష్ ఎన్నికయ్యారు. శంషాబాద్‌లోని సిటడెల్ కన్వెన్షన్‌లో లయన్స్‌క్లబ్ జిల్లా 320 ఎ గవర్న ర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్బంగా గవర్నర్ పరిధిలో నూతనంగా 1000 మంది సభ్యు లతో 8 నూతన క్లబ్బు ఏర్పాటు చేశా రు. క్లవకుర్తి క్లబ్ అధ్యక్షులుగా కలిమి చర్ల రమేష్, కార్యదర్శిగా క్రాంతి, కోశా ధికారిగా వెంకటేష్, పీఆర్ఓగా శ్రీధర్‌లనుఎన్నుకున్నారు. ఈ సందర్బంగా రమేష్ మాట్లాడుతూ క్లబ్ సేవలను విస్తృతంగా నిర్వహించి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సునిల్‌కుమార్ హజరయ్యారు. కార్యక్రమంలో క్లబ్ ప్రముఖులు చెన్నకిషన్‌రెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, గవర్నర్ జూలూరి రఘు, మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు, బావండ్ల వెంకటేష్,వెంకటస్వామి, శ్రీధర్,శ్రీనివాస్, సత్యం,రమేష్,రాఘవేందర్, శ్రీనివాస్, కిషన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ఆజాదికా మహోత్సవాలు



**కొస్గి,ఆగస్టు,1,ప్రభాతవార్త:** కొస్గి మం డల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆజాదికా అమృత్ మహోత్సవాలను నిర్వహిం చారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అద్వర్యంలో జరిగింది.ఈ సందర్బంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు.ఈ సందర్బంగా మాజీ నావిక దళ సభ్యులు మల్లయ్యను సన్మానించారు.ఈ సందర్బంగా అయన తన అనుభవాలను తెలిపారు. యుద్ధంలో పాల్గొన్నాని తెలిపారు.సముద్రంలో నెల రోజులుగా విధులు నిర్వహిం చామని తదుపరిగా ఇంజనీయర్‌గా పని చేశాని వివరించారు. దేశ రక్షణలో శారీరక దృఢత్వంతో పాటుగా దేశ భక్తి క్రమశిక్షణ అంకింత భావం మంచి లక్షణాలు ఏర్పాడి ఆర్యోకరమైన జీవితాన్ని పొందే అవకాశం ఉంటుందని వివరించారు. పాఠశాలకి జిల్లా తపస్ శాఖ నుంచి భారతమాత చిత్రపటాన్ని కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి అచ్చుగట్ల వెంకట రాములు,మండల బాధ్యులు నాగగరాజు,ఉమాలాల్,సినియార్ ఉపాధ్యాయులు కృషకణగౌడ్, మల్లికార్జున్ రవిప్రకాష్,శ్రీకాంత్,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మా గ్రామాన్ని సిసి కుంట మండలంలో కొనసాగించాలి



**చిన్నచింతకుంట,ఆగస్టు 1 ప్రభాతవార్త :** గ్రామాన్ని సిసికుంట మండలంలోనే కొనసాగించాలని సోమవారం దాసర్‌పల్లి గ్రామస్తులు తహసిల్దార్ సువర్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల నియోజకవర్గంలో కౌకుంట్ల గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించి మా గ్రామాన్ని నూతన మండలంలో చేర్చుతూ గెజిట్ విడుదల చేశారు. గతంలో గ్రామస్తుల అభిప్రాయం తెలుసుకోకుండానే తీర్మాణం ఇచ్చారని మా గ్రామాన్ని సిసి కుంట మండలంలోనే కొనసాగించేలా చూడాలని గ్రామస్తులు కోరారు. మా గ్రామానికి చిన్న చింతకుంట మండలం 5 కి.మీ. దూరం ఉంటుందని, నూతన మండలమైన కౌకుంట్ల 9 కి.మీ. దూరం ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. మాకు గతకొన్ని సంవత్సరాలుగా చిన్నచింత కుంట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని కావున మా గ్రామాన్ని సిసికుంట మండలంలోనే కొనసాగించేలా ఉన్నతాధికారులకు నివేదించాలని తహసి ల్దార్‌ను గ్రామస్తులు కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో మాసిరెడ్డి, కావలిరాజు, భాస్కర్‌రెడ్డి, సరోజన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, గుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, తిరుపతి తో పాటు తదితరులు పాల్గొన్నారు.